క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలగ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నిత్యావసరాల అందజేత

తాడిపత్రి టౌన్: స్థానిక శ్రీరాములపేటలో పక్షవాతంతో బాధపడుతున్న మాబుసాబ్, బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న అహ్మద్ మజీద్, మానసిక వికలాంగురాలైన పక్కుకు ఆదివారం నిత్యావసరాలు అందించినట్లు సమితి అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి శంకర్, కో కన్వీనర్ శ్రీరంగయ్య, చెన్నకేశవులు తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యులు శ్రీనివాసులు, కిశోర్, నాగభూషణరావు, కుమారస్వామి, ఓబులేసు యాదవ్, పాల్గొన్నారు.

జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు


పోటీలకు హాజరైన క్రీడాకారులు

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డు రఘు ఫంక్షన్ హాలులో ఆదివారం జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. స్థానిక స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను పట్టణ సీఐ ఆనందరావు ప్రారంభించారు. పోటీలకు 100 మంది వివిధ విభాగాల నుంచి క్రీడాకారులు హాజరై ప్రతిభను చాటారు. కార్యక్రమంలో విశ్రాంత పీడీ శివయ్య, శ్రీవాణి స్కూలు కరస్పాండెంట్ కార్తీక్, స్కేటింగ్ కోచ్ శివ తదితరులు పాల్గొన్నారు.

1న మెగా రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్: ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో జూలై 1న మున్సిపల్ ఆఫీసు ఎదుట నారీశక్తి మహిళల మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, ప్రోగ్రామ్ కన్వీనర్ బి.వసుంధర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీ స్వామి శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల సంపూర్ణ మద్దతుతో నిర్వహించనున్న శిబిరంలో అక్కచెల్లెమ్మలు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు.

జెడ్పీ హైస్కూల్లో వైద్య శిబిరం


వివరాలు తెలుసుకుంటున్న నిర్మలమ్మ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సూచనల మేరకు సర్పంచ్ పార్వతి ఆధ్వర్యంలో మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తల్లి నిర్మలమ్మ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. మండల వాసులకు బ్లడ్ షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులను అందజేశారు.

మహిళ మృతి


నారాయణమ్మ (ఫైల్)

యాడికి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ఆదివారం మృతి చెందింది. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కోనుప్పలపాడు గ్రామంలో బాలానారాయణ, నారాయణమ్మ(42) దంపతులు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈనెల 23న రాత్రి నారాయణమ్మ గొర్రెల మంద వద్దకు తోటి గొర్రెల కాపరుడి బైక్‌పై బయలుదేరింది. కోనక్షేత్రం వద్దకు పోయే రహదారిపై మలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓల్డ్ ఈజ్ గోల్డ్



ఒకటో తరగతి నుంచి గ్రూప్స్ వరకు ఏ పుస్తకం కావాలన్నా అర్ధ రేటే. అందుకే ఆదివారం వచ్చిందంటే చాలు నగరంలోని ఆర్ట్స్‌కాలేజీ, సుభాష్‌రోడ్, సప్తగిరి సర్కిల్ ప్రాంతాల్లో పుస్తక ప్రియుల సందడి నెలకొంటుంది. కొన్ని రకాల పుస్తకాలు మార్కెట్‌లో దొరక్కపోయినా ఇక్కడ మాత్రం సులువుగా లభిస్తాయి. స్కూళ్లు, కాలేజీలు కూడా తెరవడంతో పుస్తకాల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా ఆయా ప్రాంతాలకు వెళ్లి వారికి కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. పాత పుస్తకాలైనా సరే తమకు కావాల్సిన పుస్తకాలు అర్ధరేటుకే లభిస్తుండటంతో పుస్తక ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం


పాత పుస్తకాలను విక్రయిస్తున్న దృశ్యం


పుస్తకాలను కొనుగోలు చేస్తున్న జనం


సప్తగిరి సర్కిల్ దగ్గర ఇలా..


పుస్తకాన్ని పరిశీలిస్తున్న విద్యార్థిని


పుస్తకాలతో విద్యార్థిని

ముగిసిన జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు


అనంతపురం బాలుర జట్టుకు కప్‌ను అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీఎంఈ మంగచారి, సీనియర్ డీఈయస్ కోర్డినేషన్ అనుష (గుంటూరు) హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇలాంటి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి తర్ఫీదును పొందాలన్నారు. గెలుపోటములు సమానం తీసుకొని క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి సాఫ్ట్ బాయ్స్ విభాగంలో మొదటి స్థానంలో గుంటూరు, రెండ స్థానంలో కృష్ణ, మూడో స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి, ఇక గరల్స్ విభాగంలో మొదటి స్థానంలో కృష్ణ, రెండోస్థానంలో వైఎస్సార్ కడప, మూడో స్థానంలో అనంతపురం జట్లు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్‌టీఏ చైర్మన్ నవీన్ కుమార్, రైల్వే ఇనిస్టిట్యూట్ కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక భావసార క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఊపిరితిత్తుల వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పామిడి లయన్స్ క్లబ్, శాన్విక చెస్ట్ అండ్ అలర్జీ కేర్ ఆసుపత్రి సంయుక్త సారథ్యంలో నిర్వహించిన శిబిరంలో ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు కోనా మురళీధర్‌రెడ్డి 180 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అంతకుముందు ఊపిరితిత్తుల వ్యాధులైన క్షయవ్యాధి, ఆస్తమా, న్యూమోనియా, బ్రాంకైటిస్‌పై అవగాహనతో పాటు ముందస్తు జాగ్రత్తలను తెలియజేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యక్షురాలు డాక్టర్ శాంతిప్రియ, ప్రధాన కార్యదర్శి పీసే జయరాం రావు, డైరెక్టర్లు రఘువీర్, రోషన్ జమీర్, సుహాస్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడ్డ అంజని, వీరేష్, సుమలత

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ఆదోనిలోని గంగమ్మ ఆలయం వద్ద నివాసం ఉంటున్న ఎరుకుల అంజని అనే వ్యక్తి దాదాపు 10 మంది బంధువర్గంతో కలిసి ఆటోలో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనార్థం శనివారం సాయంత్రం దేవస్థానానికి చేరుకున్నారు. రాత్రి ఆలయం వద్దే నిద్రించిన వారు ఆదివారం ఉదయాన్నే స్వామిని దర్శించుకుని కసాపురం గ్రామంలోనే ఉంటున్న వారి బంధువుల ఇంటి వద్దకు వెళ్లి వారిని పలకరించారు. అక్కడి నుంచి ఆదోనికి ఆటోలో తిరుగుప్రయాణమయ్యారు. కసాపురం బస్టాండ్ వద్ద తగ్గులోకి వస్తున్న ఆటోకు కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎరుకల అంజని, వీరేష్ తలకు తీవ్రగాయాలు కాగా, సుమలతకు రెండు చేతులు విరిగాయి. మిగిలిన ఏడుగురు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అందరూ బాగుండాలి

- దక్షిణ భారతదేశ బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులాల జేఏసీ చైర్మన్ దాసరి రాము


విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

గుత్తి: రాష్ట్రంలోని ప్రజలందరూ బాగుండాలని, అందులో ముందు వరుసలో కాపులుండాలని దక్షిణ భారతదేశ బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులాల జేఏసీ చైర్మన్ దాసరి రాము ఆకాంక్షించారు. గుత్తిలోని స్పందన ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గుత్తి బలిజ సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో పది, ఇంటర్ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. బలిజ సంఘం అధ్యక్షుడు మారాకుల రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దాసరి రాము ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుత్తి ఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ పీవీ రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న కాపులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయడం లేదని, దీనికి కారణం ఐక్యత లోపించడమే కారణమన్నారు. అన్ని కులాలను గౌరవిస్తూ మన కులాన్ని అభివృద్ధిలోకి తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బలిజ సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారాకుల రమణ, శ్రీకరం గోవిందరాజులు, పగడాల శ్రీనివాసులు, ఆముదాల గిరిధర్, బాలరాజు, శ్రీకరం వెంకటేష్, మణికంఠ, పూల రమణ, గిరిజమ్మ తదితరులు మాట్లాడారు. సీనియర్ నాయకులు మంజు, రాము, మోహన్, రఘు, నాని, మండలంలోని ఆయా గ్రామాల కాపు సంఘం నాయకులు, బలిజ ప్రముఖులు పాల్గొన్నారు.

లాభాల బాటలో కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు


మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్

గుత్తి: ఖాతాదారులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లాభాల బాటలో పయనిస్తున్నదని బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ తెలిపారు. పట్టణంలోని వసుధా ఫంక్షన్ హాల్లో ఆదివారం బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సీఈఓ మహేశ్వర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. బ్యాంకు ప్రస్తుతం రూ.2.37 కోట్ల లాభాల్లో ఉందన్నారు. అందరూ కష్ట పడటం వల్లే బ్యాంకు లాభాల్లో ఉందన్నారు. బ్యాంకు స్థాపించి నూరు వసంతాలు పూర్తయిందన్నారు. బ్యాంకును మరింతగా వృద్ధి చేయడానికి అందరం శ్రమిస్తామన్నారు. డిపాజిట్ దారులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అనంతరం 2022–23 సంవత్సరానికి ఆడిట్ రిపోర్టు, జమా ఖర్చులు, లాభ నష్టాలు, ఆస్తి, అప్పులు వంటి వాటిని పరిశీలించి ఆమోదించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు క్రిష్ణ, రాము, స్టోర్ నాగరాజు, అంగడి నాగరాజు, మాబు, వీరన్న, వెంకటేష్, మధుసూదన్ గుప్తా, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న అనంతపురం ఎంపీ రంగయ్య

గుత్తి: పార్టీ కోసం పని చేసే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య హామీ ఇచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు శివయ్య, తొండపాడు శంకర్, చిన్న పులెప్ప, పెద్ద పులెప్ప, నారాయణస్వామి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ షఫి, చెట్నేపల్లి రమేష్, కొనకొండ్ల సూరి, సుధాకర్, వాల్మీకి శివ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో 11 రకాల ఉచిత సేవలు

గార్లదిన్నె: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల ఉచిత సేవలు అందుతాయని డీఎల్‌డీఓ ఓబులమ్మ పేర్కొన్నారు. ఆదివారం గార్లదిన్నెలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగి ప్రభుత్వ సేవలు, పథకాలు అందని వారు ఉంటే అలాంటి వారిని గుర్తించి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారికి కావాల్సిన పత్రాలు అందిస్తామన్నారు. ఎంపీ డీఓ తేజోత్స్న పాల్గొన్నారు.

శింగనమల: మండలంలో అధికారులు రెండు బృందాలుగా జగనన్న సురక్ష కార్యక్రమం అమలును పరిశీలిస్తామని ఎంపీడీఓ నిర్మలాకుమారి ఆదివారం తెలిపారు. జూలై 1న ఆకులేడు, లోలూరు, 4న పెరవలి, 6న జూలకాల్వ, 7న సీ.బండమీదపల్లి, 11న సోదనపల్లి, 13న ఉల్లికల్లు, 14న వెస్ట్ నరసాపురం, 15న సలకంచెరువు, 18న శింగనమల, 20న కల్లుమడి, 22న తరిమెల, 25న రాచేపల్లి సచివాలయాల్లో అధికారులు పర్యటిస్తారన్నారు.

పామిడి: మండలంలో అధికారులతో కూడిన రెండు వేర్వేరు బృందాలు జగనన్న సురక్ష సర్వేను పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ ఆదివారం వెల్లడించారు. జూలై 1న రామరాజుపల్లి, 4న గజరాంపల్లి, 5న వంకరాజుకాలువ, 6న రామగిరిలో, 7న పాళ్యం, 11న సొరకాయలపేట, 12న పాళ్యంతండాలో, 13న ఎద్దులపల్లిలో పర్యటిస్తారన్నారు. అలాగే జూలై 14న అనుంపల్లి, 15న దేవరపల్లి, 18న పామిడి మదీనా ఏరియా–1, 19న జీ కొట్టాల, 20న పామిడి మదీనా ఏరియా–2లో, 21న స్థానిక గుప్తాకాలనీ, 22న అంబేడ్కర్ కాలనీ, 25న పీ కొండాపురం, 26న పామిడి తలవాలకట్ట, 27న పామిడి ఎద్దులపల్లిరోడ్డు సచివాలయం పరిధిలో అధికారులు పర్యటిస్తారని వివరించారు.

సామాజిక సేవలు విస్తరించాలి


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: రోటరీ క్లబ్ సామాజిక సేవలను మరింత విస్తరించాలని రోటరీ క్లబ్ గవర్నర్ గోపాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ తిమ్మారెడ్డి నూతన కమిటీ సభ్యులకు పిలుపు నిచ్చారు. స్థానిక మెయిన్ బజార్‌లోని ఆర్‌వీస్వామి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి ప్రవీణ్‌కుమార్ తోపాటు కమిటీ సభ్యులతో రోటరీ గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గత సంవత్సరం క్లబ్ ద్వారా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల సమాచారాన్ని రోటేరియన్ షాకీర్‌బాషా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బాలసుబ్రమణ్యం, పెద్దమద్దిలేటయ్య, రామసుబ్బారెడ్డి, సంజన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



యల్లనూరు: మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. ఆదివారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట వంటి వాటిపై జిల్లా ఎస్పీ సీరియస్‌గా ఉన్నారన్నారు. వాటినా ఆడినా, ప్రోత్సహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పల్లెల్లో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా కలిసిమెలిసి జీవనం సాగించాలన్నారు. అనంతరం ఆయన పోలీస్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

సంపూర్ణ అక్షరాస్యతే 'రోటరీ' ధ్యేయం


రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: దేశాన్ని సంపూర్ణ అక్షరాస్యతగా మార్చడమే రోటరీ లక్ష్యమని సంస్థ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సాధు గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక రోటరీస్కూల్ ఆడిటోరియంలో రోటరీ, ఇన్నర్‌వీల్‌క్లబ్‌ల పట్టణ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రోటరీక్లబ్ పట్టణ అధ్యక్షుడిగా జి.శ్రీకాంత్, కార్యదర్శిగా జి.శివానంద, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా రేణుక, కార్యదర్శిగా వరలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్య, వైద్య, సామాజిక రంగాల్లో రోటరీ అందిస్తున్న విశిష్ట సేవలను మరింత విస్తరించి ప్రజల చేత మన్ననలను పొందాలని గోపాలకృష్ణ నూతన కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం నూతన కార్యవర్గసభ్యులతో పాటు మాజీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్ కుమార్, డిష్‌రామును శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ కట్టా శ్యామల, సీనియర్ రొటేరియన్లు డాక్టర్ రామ్మూర్తి, వీఎల్.గుప్త, డీవీఎస్, మాధవీలత, శిరీష్, సురేష్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి గ్రామసభలు

పుట్లూరు: మండలంలో చేపడుతున్న సామాజిక తనిఖీపై ఈ నెల 26 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ చెన్నకేశవులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 26న ఎల్లుట్ల, గరుగుచింతలపల్లి, 27న కుమ్మనమల, చెర్లోపల్లి, 28న కోమటికుంట్ల, 29న దోశలేడు, కడవకల్లు, బాలాపురం, పుట్లూరు, మడుగుపల్లి, తక్కళ్లపల్లి, 30న రంగరాజుకుంట, అరకటివేముల, జూలై 1న కొండేపల్లి, సి.వెంగన్నపల్లి, గాండ్లపాడు, జంగంరెడ్డిపేట, జూలై 2న శనగలగూడూరు, మడ్డిపల్లి, కొండాపురం, చాలవేముల గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన వివరాలను వెల్లడిస్తారని పేర్కొన్నారు. జూలై 3న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో బహిరంగ సభ ఉంటుందని తెలియజేశారు.

ధ్రువీకరణ పత్రాలు అందించాలి

పుట్లూరు: అర్హత ఉండి తగిన ధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించడంతో పాటు, వారికి అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని అరకటివేముల, ఏ.కొండాపురం గ్రామాల్లో పర్యటించారు. జగనన్న సురక్ష పథకం కింద చేపడుతున్న వలంటీర్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు.

జేవీవీ సభ్యత్వ నమోదు పోస్టర్ల విడుదల


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఆదివారం జేవీవీ నాయకులు జేవీవీ సభ్యత్వ నమోదు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జేవీవీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, మండలాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జేవీవీలో చేరాలని పిలుపునిచ్చారు. జేవీవీ అంటే జనాలకు విజ్ఞానాన్ని అందించే సంస్థ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుశంకర్, దేశాయి నాగరాజు, ఖలీల్, మాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ కబడ్డీ అసోసియేషన్ కోశాధికారిగా వెంకటేష్


మంజుల వెంకటేష్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి కెఈ.ప్రభాకర్, క్రీడాకారులు

గుంతకల్లుటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కోశాధికారిగా గుంతకల్లు పట్టణానికి చెందిన ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపకుడు మంజుల వెంకటేష్ ఎన్నికయ్యారు. ఆదివారం బాపట్లలోని లోటస్‌పాండ్ రిసార్ట్‌లో జరిగిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో 13 ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తనను కోశాధికారిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో కోశాధికారిగా తనను ఎన్నుకున్నందుకు, కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని వెంకటేష్ పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి

యాడికి: తన ఇంటి వద్ద స్థలం వదిలి పునాది తీసుకో అన్నందుకు వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటన నిట్టూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలూ.. గ్రామానికి చెందిన వెంకటరమణ తన ఇంటి చుట్టూ కాంపౌండ్ కట్టేందుకు పునాదిని తీస్తున్నాడు. ఈక్రమంలో వెంకటరమణ ఇంటి పక్కనే ఉన్న నాగేశ్వర రావు నీ హద్దులో మాత్రమే పునాది తవ్వుకో అని వెంకటరమణకు చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటరమణ పికాసీతో నాగేశ్వరావు తలపై కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంకటరమణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు రావులుడికిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పెద్దవడుగూరు: రావులుడికి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

చీనీ చెట్ల కొమ్మలు నరికివేత

పెద్దవడుగూరు: మండలంలోని మొలకతాళ్లకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జయరామరెడ్డి చీనీ తోటలో చెట్ల కొమ్మలను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. శుక్రవారం సాయంత్రం వరకూ తోటలోనే పనులు చూసుకుని ఇంటికి వచ్చిన ఆయన శనివారం సాయంత్రం తిరిగి తోట వద్దకెళ్లారు. అప్పటికే 12 చెట్ల కొమ్మలు నరికివేశారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం జయరామరెడ్డితోటను పరిశీలించారు.